వడ్డెర్ల సమస్యల పరిష్కారానికి కృషి



ఉపముఖ్యమంత్రిని సత్కరిస్తున్న ఎత్తరి అంతయ్య, సత్యనారాయణ

చిక్కడపల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): వడ్డెర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. వడ్డెర లేబర్ కాంట్రాక్టర్స్ సొసైటీ సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యలను వడ్డెర్ల లక్ష్య సాధన రాష్ట్ర అధ్యక్షుడు జెరిపేటి సత్యనారాయణ రాజు, వడ్డెర సంఘం తెలంగాణ(గన్నుదెబ్బ) రాష్ట్ర అధ్యక్షుడు ఎత్తరి అంతయ్య మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్కను సత్కరించారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకుడు జెరిపేటి రాజు పాల్గొన్నారు.

కుల సంఘాలు అభివృద్ధి పనుల్లో భాగస్వాములు కావాలి

- ఎమ్మెల్యే ముఠాగోపాల్

ముషీరాబాద్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ గంగపుత్ర సంఘం అధ్యక్షుడిగా కాడబోయిన కొండల్ నియమితులయ్యారు. శుక్రవారం మర్యాద పూర్వకంగా ఎమ్మెల్యే ముఠా గోపాల్‌ను కలిసి సంఘం కమిటీ సభ్యులను ఆయనకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా ముఠా గోపాల్ మాట్లాడుతూ.. కుల సంఘాలు అభివృద్ధి పనుల్లో భాగస్వామ్యం కావాలని సూచించారు. కార్యక్రమంలో భోలక్‌పూర్ గంగపుత్ర సంఘం మహిళా కమిటీ అధ్యక్షురాలు గంగ, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గోవింద్‌రాజ్, బాబురావు, సంఘం నాయకులు స్వప్న, సరిత, రాధిక, పద్మ, కవిత, గోపాల్, అశోక్, శంకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ముషీరాబాద్ మండల డిప్యూటీ ఐవోఎస్ స్వరూపరాణి

ఉపాధ్యాయులకు నైపుణ్య శిక్షణ

ముషీరాబాద్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి):ఉపాధ్యాయుల్లో బోధన నైపుణ్యం పెంచే దిశగా విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. శుక్రవారం ముషీరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నూతనంగా పదోన్నతి పొందిన స్కూల్ అసిస్టెంట్‌లకు, ప్రత్యేక విద్య, ఉపాధ్యాయులకు ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముషీరాబాద్ విద్యామండలి డిప్యూటీ ఐవోఎస్ స్వరూపరాణి మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని సూచించారు. వృత్తి నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర రిసోర్స్ పర్సన్ ప్రసాద్, డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్‌లు శ్రీనాథ్‌శర్మ, లక్ష్మీపతి, బాలరాజు, పద్మావతి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో

కూచిపూడి నృత్యప్రదర్శన

రాంనగర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): పద్మాకాలనీలో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, కళాక్షేత్రం సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. ప్రముఖ కళాకారులు కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన కళాకారులను అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పుల్లయ్య, మాచర్ల రంగయ్య సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కోశాధికారి నగధీర్, ఉపాధ్యక్షుడు బోస్, కల్చరల్ సెక్రటరీ అభినందన భవానీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాతీయ ట్రాన్స్‌జెండర్ హక్కుల కార్యకర్త ముద్రబోయిన రచన

ట్రాన్స్‌జెండర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయండి

రాంనగర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ట్రాన్స్‌జెండర్ల సంక్షేమ బోర్డును రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయాలని జాతీయ ట్రాన్స్‌జెండర్ హక్కుల కార్యకర్త ముద్రబోయిన రచన డిమాండ్ చేశారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ప్రజా సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రచన మాట్లాడారు. రాష్ట్రంలో 4 లక్షల మంది హిజ్రాలు, ట్రాన్స్‌జెండర్స్ ఉంటే బడ్జెట్‌లో రూ. 2కోట్లు కేటాయించడం అన్యాయం అన్నారు. తమ కోసం ప్రత్యేకంగా ట్రాన్స్‌జెండర్ హిజ్రా వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి చైర్మన్, డైరెక్టర్లను నియమించి నిధులు కేటాయించాలన్నారు. భూపతి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ట్రాన్స్‌జెండర్స్‌కు కమ్యూనిటీ షెల్టర్, హెల్త్ కేర్ సెంటర్, కల్చరల్ ఫెస్ట్ ఏర్పాటు చేయాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. ట్రాన్స్‌యాక్టివిస్ట్ లిలీ, ఉమెన్ యాక్టివిస్ట్ స్వేచ్ఛ, ఆయూష తదితరులు పాల్గొన్నారు.



అటవీ శాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న శివసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన్ తదితరులు

గచ్చిబౌలిలోని 400 ఎకరాలు

హెచ్‌సీయూకు కేటాయించండి

రాంనగర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): కంచెగచ్చిబౌలిలోని 400 ఎకరాలను హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి కేటాయించాలని శివసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సుదర్శన్ ఆధ్వర్యంలో శుక్రవారం సచివాలయం రోడ్డులోని అటవీ శాఖ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహజ సిద్ధమైన అడవిని నరకడం వల్ల అందులోని పక్షులు, వన్యప్రాణుల మనుగడకు ఆటంకం ఏర్పడుతోందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి తన నిర్ణయాన్ని మార్చుకుని పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. చెట్లు నరికివేస్తే భవిష్యత్ తరాలకు ఆక్సిజన్ దక్కదన్నారు. కార్యక్రమంలో శివసేన పార్టీ నాయకులు పూస శ్రీనివాస్, మహేష్‌కుమార్, కేశవ్‌కుమార్, వంశీధర్, శ్రీనివాస్‌రెడ్డి, మనోజ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వివాహ పరిచయ వేదికను

సద్వినియోగం చేసుకోవాలి

రాంనగర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఉచిత వివాహ పరిచయ వేదికను సద్వినియోగం చేసుకోవాలని జియో వివాహ పరిచయ వేదిక సీఈవో అబ్రహాం కోరారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి శనివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు, ఆదివారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు వివాహ పరిచయ వేదికలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆసక్తిగల వారు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ డాట్ జియోమ్యాట్రిమోనీ డాట్‌కామ్‌ను సందర్శించవచ్చన్నారు. వివరాలకు 8885073555, 8885428555 ఫోన్ సంప్రదించవచ్చన్నారు.

పెచ్చులూడుతున్న వాంబే భవనాలు

- నివాసితుల ఆందోళన
- ఇళ్ల మధ్యలో పేరుకుపోయిన చెత్తాచెదారం
- నిత్యం పొంగుతున్న డ్రైనేజీలు
- మొదటి అంతస్తు వరకే నీటి సరఫరా
- సమస్యలను పట్టించుకోని అధికారులు, ప్రజా ప్రతినిధులు



పెచ్చులూడుతున్న భవనం

కవాడిగూడ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): బీమా మైదాన్ వాంబే కాలనీలో నిత్యం సమస్యలు రాజ్యమేలుతున్నాయి. స్లాబు పెచ్చులూడుతుందని, మరమ్మతులు చేయించాలని అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని బస్తీ వాసులు ఆరోపిస్తున్నారు. 2006లో వాంబే పథకంలో భాగంగా వరద బాధితులతో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో ఇళ్లు లేని వారి కోసం 496 ఇళ్లు నిర్మించారు. వీటిలో మధ్యతరగతి, రోజు వారీగా పనులు చేసుకునే వారే నివసిస్తున్నారు.

పారిశుధ్యం, డ్రైనేజీ సమస్య

కాలనీలో ఇళ్ల మధ్యలో చెత్తకుప్పలు పేరుకుపోవడం తోపాటు నిత్యం డ్రైనేజీలు పొంగుతున్నాయని ఫిర్యాదు చేసినా నామమాత్రంగా మరమ్మతులు చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. రెండు రోజుల్లోనే సమస్య పునరావృతం అవుతోందంటున్నారు. సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కోరుతున్నా పట్టించుకునే వారు లేరని వాపోతున్నారు. ఇళ్ల మధ్యలో చెత్త పేరుకుపోవడంతో దుర్వాసనతో అనారోగ్యం బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. చెత్తను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. గతంలో ఉదయం, సాయంత్రం వేళల్లో తాగునీరు సరఫరా చేసేవారని, ప్రస్తుతం అర్ధరాత్రి తక్కువ సమయం సరఫరా చేయడంతో నీరు సరిపోక ఇబ్బందులు పడుతున్నామంటున్నారు. గతంలో నీటి సరఫరా జి ప్లస్ మూడు అంతస్తుల వరకు ఉండేదని, ప్రస్తుతం మొదటి అంతస్తు వరకే సరఫరా అవుతోందన్నారు.



ఇళ్ల మధ్యలో పేరుకుపోయిన చెత్తాచెదారం

సమస్యలు పరిష్కరించాలి



బీమా మైదాన్ వాంబే కాలనీలో సమస్యలను పరిష్కరించాలి. మూడు అంతస్తుల వరకు తాగునీరు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలి. పారిశుధ్య సమస్యను పరిష్కరించాలి. డ్రైనేజీలు పొంగకుండా సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలి.

- కె. శంకర్, బీమా మైదాన్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు

సమస్యల పరిష్కారానికి చర్యలు



వాంబే కాలనీలో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. మూడు అంతస్థుల వరకు నీటి సరఫరా చేయాలని వాటర్‌వర్క్స్ అధికారుల దృష్టికి తీసుకెళ్తా. భవనాల మరమ్మతు, పారిశుధ్య సమస్య పరిష్కారానికి తనవంతు కృషి చేస్తా.

- జి. రచనశ్రీ, కవాడిగూడ కార్పొరేటర్

శ్రీరామనవమి శోభాయాత్రకు విస్తృత ఏర్పాట్లు



మాట్లాడుతున్న డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు

బర్కత్‌పుర, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి శోభాయాత్రను ఘనంగా నిర్వహించేందుకు అంబర్‌పేట నియోజకవర్గంలో ఏర్పాట్లు చేస్తున్నామని శోభాయాత్ర కన్వీనర్ డాక్టర్ ఎన్. గౌతమ్‌రావు తెలిపారు. శుక్రవారం కాచిగూడ వీరన్నగుట్టలోని శ్యామ్‌బాబా మందిరంలో శోభాయాత్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఈనెల 6వ తేదీ సాయంత్రం 3 గంటలకు అంబర్‌పేట మునిసిపల్ గ్రౌండ్ నుంచి యాత్ర ప్రారంభమై ఛేనెంబర్, తిలక్‌నగర్, ఫీవర్ ఆస్పత్రి, బర్కత్‌పుర చౌరస్తాలు, కాచిగూడ వీరసావర్కర్ విగ్రహం నుంచి సుల్తాన్‌బజార్‌లోని శ్రీహనుమాన్ వ్యాయామశాలకు చేరుకుంటుందన్నారు. దారిపొడవును 18 స్వాగత మండపాలను ఏర్పాటు చేస్తున్నామని, 500 మంది వలంటీర్లు యాత్ర సజావుగా సాగటానికి కృషి చేస్తారని తెలిపారు. హిందువులందరూ శోభాయాత్రలో పాల్గొని తమ ఐక్యతను చాటిచెప్పాలని పిలుపునిచ్చారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, చైతన్య శక్తిపీఠం పీఠాధిపతి చైతన్యానంద మహారాజ్ తదితరులు పాల్గొంటున్నారన్నారు. కార్యక్రమంలో శోభాయాత్ర ప్రతినిధులు కన్నె రమేష్‌యాదవ్, ఏ.సూర్యప్రకాష్‌సింగ్, ఎడెల్లి అజయ్‌కుమార్, సి.వినోద్‌యాదవ్, నందకిషోర్‌యాదవ్, ఎక్కాల కన్నా తదితరులు పాల్గొన్నారు.



విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న కళా జనార్దనమూర్తి తదితరులు

గానసభలో అభయ గణపతి విగ్రహ ప్రతిష్ఠ

చిక్కడపల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): త్యాగరాయగానసభ ప్రాంగణంలో శుక్రవారం వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య అభయ గణపతి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం జరిగింది. శృంగేరి పండితుల సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కృష్ణశిలతో రూపుదిద్దుకున్న రెండున్నర అడుగుల అభయ గణపతి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అతిథులుగా గానసభ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కళా జనార్దనమూర్తి, కళా శారద, రసమయి అధ్యక్షుడు ఎంకే రాము, హాస్యావధాని శంకరనారాయణ, వంశీ సంస్థల అధ్యక్షుడు వంశీ రామరాజు, రామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో ఇబ్బందులు

- కరెంట్ స్తంభాలపై కూలిన చెట్లు
- గంటలపాటు నిలిచిపోయిన విద్యుత్ సరఫరా

రాంనగర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): బాకారం లక్ష్మీటవర్ వద్ద గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి చెట్టుకూలి కరెంట్ స్తంభంపై పడింది. స్తంభం విరిగిపోవడంతో దాదాపు మూడుగంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. స్థానికులు కార్పొరేటర్ కె. రవిచారికి ఫిర్యాదు చేయడంతో అక్కడికి చేరుకొని సమస్యను ట్రాన్స్‌కో అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఏడీఈ కమల్‌కుమార్ పర్యవేక్షణలో ఎమర్జెన్సీ స్క్వాడ్ అక్కడికి చేరుకుని కూలిన చెట్టు, స్తంభాన్ని తొలగించి తాత్కాలికంగా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. బాగ్‌లింగంపల్లిలో అంబేడ్కర్ కళాశాల వద్ద వర్షానికి భారీ వృక్షం కూలిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. నారాయణగూడ ట్రాన్స్‌కో ఏడీఈ వినోద్, ఎమర్జెన్సీ సిబ్బంది అక్కడికి చేరుకుని కూలిన చెట్టును తొలగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. బాగ్‌లింగంపల్లిలో దాదాపు రెండుగంటలపాటు కరెంట్ సరఫరా నిలిచిపోయింది. చిక్కడపల్లి వేంకటేశ్వరస్వామి కమాన్ వీధి, దేవాలయం పరిసర ప్రాంతాలలో గురువారం రాత్రి 7 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

ముషీరాబాద్: భారీ వర్షానికి మహాత్మానగర్‌లో చెట్టు కొమ్మలు విరిగి విద్యుత్ స్తంభంపై పడడంతో పక్కకకు ఒరిగిపోవడంతోపాటు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విషయాన్ని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బిజ్జి కనకేష్ కుమార్ విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో శుక్రవారం స్తంభంపై పడిన చెట్టు కొమ్మలను తొలగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

వరద నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలి

చిక్కడపల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రోడ్లపై వరదనీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ. పావని జీహెచ్ఎంసీ సిబ్బందిని ఆదేశించారు. గురువారం కురిసిన భారీ వర్షానికి డివిజన్‌లోని పలు చోట్ల వర్షపునీరు నిలిచిపోయి ప్రజలు ఇబ్బందులు పడ్డారన్న ఫిర్యాదు మేరకు శుక్రవారం జీహెచ్‌ఎంసీ సిబ్బందితో మ్యాన్‌హోళ్లను శుభ్రం చేయించారు. బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎ. వినయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మ్యాన్‌హోల్‌ను దగ్గరుండి శుభ్రం చేయిస్తున్న కార్పొరేటర్ పావని



బాగ్‌లింగంపల్లిలో కూలిన చెట్టు తొలగింపు పనులను పరిశీలిస్తున్న ట్రాన్స్‌కో ఏడీఈ వినోద్



భారీ వర్షానికి బురదమయంగా మారిన ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణం



పద్మా కాలనీలో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

పద్మా కాలనీలో ఎమ్మెల్యే పర్యటన

రాంనగర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): అడిక్‌మెట్ డివిజన్ పద్మా కాలనీలో వరద నీటి సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ సూచించారు. శుక్రవారం కాలనీలో పలు ప్రాంతాల్లో పర్యటించి నాలాలను పరిశీలించారు. ప్రజలను అడిగి వివరాలు తెలుసుకున్నారు. వర్షం వల్ల నష్టపోయిన వాహనదారులకు ఆర్థిక సహాయం అందించేందుకు కృషి చేస్తామన్నారు. నాలా పక్కన నివసిస్తున్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ముఠా జైసింహ, కె. సురేందర్, బల్ల శ్రీనివాస్‌రెడ్డి, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ నాగేశ్వర్‌రావు తెలిపారు. బౌద్ధనగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 9 నుంచి 10 గంటల వరకు, ఆప్కో పరిధిలో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు, బసంత్ కాలనీ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి 3.30 గంటల వరకు, అడిక్‌మెట్, బాలాజీనగర్ పరిధిలో సాయంత్రం 4 నుంచి 4.30 గంటల వరకు, విద్యానగర్ పరిధిలో సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఏ పేర్కొన్నారు.

రేపు తుల్జాభవన్‌లో సీతారాముల కల్యాణం

బర్కత్‌పుర, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): దేవాదాయ శాఖ, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తాధ్వర్యంలో ఈ నెల 6న కాచిగూడలోని తుల్జాభవన్‌లో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్నామని తుల్జాభవన్ కార్య నిర్వహణాధికారి ఎస్.అంజనరెడ్డి తెలిపారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఆదివారం ఉదయం 10 గంటలకు కల్యాణం ప్రారంభమవుతుందని తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంటకు అన్నదాన కార్యక్రమం, రాత్రి 7 గంటలకు ఉత్సవ మూర్తుల పల్లకీ సేవ, ఊరేగింపు ఉంటుందని పేర్కొన్నారు.

దివ్యాంగ నిర్ధారణ శిబిరం రేపు

నల్లకుంట, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): చంపాపేటలోని మినర్వా గార్డెన్స్‌లో ఈనెల 6వ తేదీ ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు దివ్యాంగ నిర్ధారణ ఉచిత శిబిరం నిర్వహిస్తున్నామని నారాయణ్ సేవా సంస్థాన్ ప్రతినిధులు తెలిపారు. శుక్రవారం హైదర్‌గూడ ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జన్మత్ బాయ్ పటేల్, అల్కా చౌదరి, సామాజిక కార్యకర్త రిధేష్ జాగీర్దార్, అభయ్‌చౌదరి, భగవాన్ ప్రసాద్ మాట్లాడారు. శిబిరంలో దివ్యాంగులను వైద్యులు పరీక్షించి కృత్రిమ అవయవాల కోసం కొలతలు తీసుకుంటారని తెలిపారు. వివరాలకు 7023509999 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

రవాణాకు అంతరాయం.. స్పందించని అధికారులు

రాంనగర్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమై ప్రజలు ఇబ్బందులు పడినా చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి. సాయిబాబా ఆరోపించారు. శుక్రవారం పార్టీ నగర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షం వల్ల పలుచోట్ల కరెంటు స్తంభాలు, చెట్లు పడిపోయి రవాణాకు అంతరాయం ఏర్పడినా అధికారులు స్పందించకపోవడం శోచనీయమన్నారు. కొన్ని ప్రాంతాల్లో ప్రజలు చీకట్లో గడపాల్సి వచ్చిందన్నారు. హైదరాబాద్ నగరానికి దీటుగా మరో నగరాన్ని నిర్మిస్తామంటున్న నాయకులు విశ్వనగరాన్ని విషాద నగరంగా మార్చారన్నారు. కొద్దిపాటి వర్షానికే హైటెక్ సిటీ చెరువులను తలపిస్తోందని, గంటల సమయం ట్రాఫిక్ జామ్ అవుతున్నా చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శులు నల్లెల కిషోర్, పి.బాల్‌రాజ్‌గౌడ్ పాల్గొన్నారు.

వైశ్య హాస్టల్ ట్రస్ట్‌బోర్డు కార్యవర్గం

బర్కత్‌పుర, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): వైశ్య హాస్టల్ ట్రస్ట్‌బోర్డు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. చైర్మన్‌గా కొత్తూరు జయప్రకాష్‌రామ్, కార్యదర్శిగా కొండ్లె మల్లికార్జున్, కోశాధికారిగా వెంపటి మధు ఎన్నికయ్యారు.

టీ తాగటానికి వెళ్లిన వృద్ధుడి అదృశ్యం

చిక్కడపల్లి, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): టీ తాగటానికి వెళ్లిన వృద్ధుడు అదృశ్యమయ్యాడు. పశ్చిమబెంగాల్‌కు చెందిన సుకుమార్ దాస్(77) అశోక్‌నగర్‌లో నివసిస్తున్న మనవరాలు పుష్ప ఇంటికి కొద్దిరోజుల క్రితం వచ్చాడు. శుక్రవారం టీ తాగటానికి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. సుకుమార్‌దాస్ ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు చిక్కడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తండ్రీకొడుకులను గాయపర్చిన వ్యక్తికి పదిరోజుల జైలు

కవాడిగూడ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు వ్యక్తులను గాయపరిచిన వ్యక్తికి న్యాయస్థానం పదిరోజుల జైలు శిక్ష విధించింది. అంబేడ్కర్‌నగర్‌లో నివసిస్తున్న టి. కృష్ణ(35) ఆటో డ్రైవర్. స్నేహితులతో కలిసి కొంతకాలంగా ఇంటి ఎదుట క్రికెట్ ఆడుతున్నాడు. ఇటీవల స్నేహితులతో కలిసి క్రికెట్ ఆడాడు. బంతి సమీపంలో ఉంటున్న బాబురావు ఇంట్లోకి వెళ్లింది. అతడు బంతిని హుస్సేన్‌సాగర్ నాలాలో పడేశాడు. కోపోద్రిక్తుడైన కృష్ణ బాబురావు, అతడి కుమారుడితో గొడవపడి దాడిచేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు దోమలగూడ పోలీసులు కృష్ణపై పెట్టీ కేసు నమోదు చేశారు. నిందితుడిని శుక్రవారం 13వ సెషన్ కోర్టు జడ్జి ఎదుట హాజరుపర్చారు. కేసును విచారించిన జడ్జి నిందితుడికి పదిరోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారని పోలీసులు తెలిపారు.

రైలు ఢీకొని వైద్యురాలి మృతి

బర్కత్‌పుర, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని వైద్యురాలు మృతి చెందింది. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. మలకపేట కాలాడేరాలో నివసిస్తున్న అలీషా(26) కాచిగూడ బస్తీ దవాఖానాలో వైద్యురాలిగా పనిచేస్తోంది. శుక్రవారం ఉదయం 10 గంటల సమయంలో దవాఖానాకు వెళ్లడానికి మలకపేట రైల్వే స్టేషన్‌కు వచ్చింది. పట్టాలుదాటుతుండగా కర్ణాటక సంపర్క్ క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలులో మహిళ మెడలో మంగళసూత్రం చోరీ

రైలులో ప్రయాణికురాలి మెడలో బంగారు మంగళసూత్రాన్ని గుర్తుతెలియని వ్యక్తి లాక్కొని పారిపోయాడు. మాసబ్‌ట్యాంక్‌లో నివసిస్తున్న ఎం. కల్పన సరోజినీదేవి కంటి ఆస్పత్రిలో నర్సింగ్ అధికారిగా పనిచేస్తున్నారు. కుటుంబ సభ్యులతో గురువారం సాయంత్రం తిరుపతి నుంచి వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ రైల్‌లో కాచిగూడ వస్తున్నారు. రాత్రి 11.30 గంటల సమయంలో డీన్ రైల్వే స్టేషన్ సమీపంలో సిగ్నల్ కోసం రైలు ఆగింది. ఆ సమయంలో రైలు బోగీ కిటికీలోంచి గుర్తుతెలియని వ్యక్తి ఆమె మెడలోని రెండున్నర తులాల మంగళసూత్రాన్ని లాక్కొని పారిపోయాడు. బాధితురాలు శుక్రవారం రాత్రి కాచిగూడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి డీన్ రైల్వే పీఎస్‌కు బదిలీ చేశారు.



అనంతపురం జిల్లా, తాడిపత్రి మండలం, చిన్నపోడమల గ్రామంలో శ్రీకృష్ణ మందిరంలో జరిగే వేడుకలకు శుక్రవారం కాచిగూడ రైల్వే స్టేషన్ నుంచి బయల్దేరి వెళ్తున్న భక్తులు.

- బర్కత్‌పుర, ఆంధ్రజ్యోతి